చినుకు రాలదు.. విత్తు పడదు!

- మునురుకున్న మేఘాలు.. జాడలేని వరుణుడు
- ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- అదనులో వర్షం పడితే పంటకు అనుకూలం



పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు



విత్తనకాయలను వలుస్తున్న దృశ్యం

గాండ్లపెంట: ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలతో మురిపించిన వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. వేరుశనగ రైతులు విత్తనాలు సిద్ధం చేసుకుని పంట సాగుకు సిద్ధమయ్యారు. అయితే వర్షం రాకపోవడంతో ఆకాశంపైపు చూసి నిట్టూరుస్తున్నారు. అదను(అరుద్ర కార్తె)లో వర్షం వస్తే వేరుశనగ పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్న నమ్మకంతో రైతులు ఉన్నారు. ఇంకా ఆరుద్ర కార్తె 10 రోజులు గడువు ఉందని పంట సాగుకు సమయం ఉన్నా వరుణుడు కరుణించపోడా అనే ఆశతో ఉన్నారు. వచ్చే చిన్నకుశాలు, పెద్దకుశాలు కార్తెల్లో పంట సాగు చేసినా పంట చేతికి వస్తుందన్న నమ్మకంలేదంటున్నారు.

కరుణించని వరుణుడు

మేఘాలు ముసురుకుని తుంపర్లు తప్ప పదును వర్షం పడటంలేదు. కాగా గణాంకాల ఆధారంగా ఈ ఏడాది మార్చి నెలలో 4.3 ఎంఎం పడాల్సి ఉండగా 1.6 ఎంఎం, ఏప్రిల్ నెలలో 25.5 ఎంఎంకు గాను 9.3 ఎంఎం వర్షపాతం నమోదైంది. ఇక జూన్‌లో 80 ఎంఎంలు పడాల్సి ఉండగా ఇప్పటి వరకు 17.4 ఎంఎం వర్షపాతం కురిసింది. కదిరి నియోజకవర్గంలోని 6 మండలాల్లోనూ వేరుశనగ పంట సాధారణ సాగు 53,932 హెక్టార్లు కాగా అందులో గతేడాది 21,091 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. పంట సాగు సగానికి సగం తగ్గిపోయింది. ఈ ఏడాది కూడా చాలా మంది రైతులు పంట సాగుకు ముందుకు రావడం లేదు. దీంతో సాధారణ సాగు విస్తీర్ణంగా కన్నా తక్కువగా పంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

గతేడాది పంట నష్టపోయా



గతేడాది 4 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఎకరాకు దాదాపుగా రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చుకాగా పెట్టుబడి సైతం రాలేదు. పొలాలను బీడు వదల్లేక వేరుశనగ కట్టె పశువులకు మేతగా అయినా ఉంటుందని రూ.లక్ష దాకా వెచ్చించా. ఈ ఏడాది సైతం పంట సాగుకు పొలాలు దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసుకున్నా.

– కేశవ, కోటూరు గ్రామం

వర్షంపైనే ఆధారపడాలి



ఎటువంటి సాగునీటి వనరులు లేక పోవడంతో వర్షాధారంపైనే ఆధారపడి ఏటా వేరుశనగ పంట సాగు చేస్తున్నా. 5 ఎకరాల్లో పంట సాగు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన మూడు బస్తాలతో పాటు ప్రైవేటు వ్యాపారుల వద్ద మరో 4 బస్తాలు తీసుకున్నా. అదనులో వర్షం వస్తే విత్తుతా. లేకుంటే విత్తనకాయలు అమ్ముకోవాల్సి వస్తుంది.

– చిన్న ఆంజనేయులు, మలమీదపల్లి

ఆగస్టు మొదటి వారం వరకు అదను



ఖరీఫ్‌లో వేరుశనగ పంట విత్తేందుకు ఆగస్టు మొదటి వారం వరకు అదను ఉంది. ఈ విషయంలో రైతులు ఎవరూ ఆధైర్య పడాల్సిన పనిలేదు. ఈ ఏడాది వర్షాలు కూడా సమృద్ధిగా కురిసే అవకాశం ఉంది. వాతావరణం కూడా అనుకూలంగా ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటికే మండలంలో రైతులు 484 హెక్టార్లలో వేరుశనగ విత్తారు.

– సయ్యద్ షాదాబ్, మండల వ్యవసాయాధికారి, గాండ్లపెంట

మూడో రోజూ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



దీక్షలు చేస్తున్న కార్మికులు

ధర్మవరం: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన రిలే దీక్షల్లో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ ఆయూబ్‌ఖాన్, కార్మిక సంఘం అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి బాబు, జయచంద్ర మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీఓ 36 అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన మల్లేసు , వెంగముని

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి బైపాస్‌లో వేల్పుమడుగు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం.. తాడిమర్రి మండలం మర్రిమేకలపల్లి గ్రామానికి చెందిన మల్లేసు తన మామను పిలుచుకొని బత్తలపల్లి మండలం వేల్పుమడుగుకు బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. వేల్పుమడుగు గ్రామానికి చెందిన వెంగముని బత్తలపల్లికి వచ్చేందుకు వేచి ఉండగా బైక్‌పై అతడిని ఎక్కించుకున్నాడు. బత్తలపల్లి బైపాస్ వద్దకు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అనంతపురం నుంచి తంబాలపల్లికి వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్ రమేష్‌రెడ్డి అదేకారులోనే క్షతగాత్రులను ఆర్డీటీ ఇసుపత్రికి తీసుకువచ్చి వైద్యం చేయించారు. కారులో ఉన్న రెండేళ్ల చిన్నారికి స్వల్పగాయాలు కాగా, రమేష్‌రెడ్డి, అతని భార్య క్షేమంగా బయటపడ్డారు. వెంగమునిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నట్టల నివారణతో జీవాలకు ఆరోగ్యం



గొర్రెలకు నట్టల నివారణ మందును తాపిస్తున్న ఏడీ శ్రీనివాసులు

బత్తలపల్లి: గొర్రెల్లో, మేకల్లో నట్టల నివారణ టీకాలతో జీవాలకు ఆరోగ్యం లభిస్తుందని ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రామాపురం, తంబాపురం, దంపెట్ల, గంటాపురం, డి.చెర్లోపల్లి, మాల్యవంతంలో ఆయన డీవార్మింగ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో 2,650 జీవాలకు నట్టల నివారణ టీకాలను తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు బరువు పెరుగుతాయన్నారు. మరణాల రేటును తగ్గడంతోపాటు మాంసం, ఉన్ని నాణ్యతగా ఉంటాయన్నారు. నట్టలు గొర్రెల శరీరంలో పోషకాలను పీల్చుకుంటాయన్నారు. నట్టలు లేనప్పుడు గొర్రెలు ఆహారాన్ని బాగా జీర్ణం చేసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, పశువైద్య సిబ్బంది సురేష్, మారుతి, రాము, గొర్రెల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో దాడి చేసిన వారిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎగ్జిబిషన్‌లో నిర్వాహకులపై దాడి చేసి గాయపరిచిన వారిపై శనివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గంగయ్య తన భార్య, పిల్లలతో కలిసి హిందూ శ్మశాన వాటిక వద్ద ఎగ్జిబిషన్ నడుపుకునేవాడు. ఈనెల 23న పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఎగ్జిబిషన్ మూసివేసే సమయంలో వెళ్లి గొడవ చేసి నిర్వాహకులను ఆరీఫ్ ఉల్లా, ఇంతియాజ్, బాబా, చాంద్ బాషాతోపాటు మరికొందరు రాళ్లు, కట్టెలతో దాడి చేసి ఎగ్జిబిషన్‌లోని వస్తువులను ధ్వంసం చేశారు. బాధితుడు గంగయ్య ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ముదిగుబ్బ: పట్నం ఎస్‌ఐ కె. రాజశేఖర్, సిబ్బంది శనివారం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన నాటుసారా, మద్యం మొత్తం 58 లీటర్ల మద్యాన్ని మలకవేమల క్రాస్‌లోని అటవీ ప్రాంతంలో ధ్వంసం చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

నల్లచెరువు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2024–2025కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో నిర్వహించిన 13 రకాలైన పనులకు సంబంధించిన బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బిల్లులకు సంబంధించి ఎలాంటి అవకతవకలు లేవన్నారు. ఆసుపత్రి నిర్వహణలో చిన్నపాటి లోపాలున్నాయని, సరిచేసుకోవాని వైదాధికారులకు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర, వైద్యాధికారులు కల్పనరెడ్డి, డాక్టర్ అలేఖ్య, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు రెడ్డెమ్మ, సుధాకర్ పాల్గొన్నారు.

పౌర హక్కులను వినియోగించుకోవాలి



రమణప్పగారిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు



మాట్లాడుతున్న తహసీల్దార్ షాబుద్దీన్

నల్లచెరువు: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా సూచించారు. డి.రమణప్పగారిపల్లిలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ కాలనీ వాసులతో సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో అంటరాని తనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు కలిసి ఇళ్లలోకి చేరుతున్నాయని, సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఎంపీడీఓ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌ఐ లక్ష్మీదేవి, వీఆర్‌ఓ శ్రీనివాసులు కానిస్టేబుల్ రమణ, వీఆర్‌ఏలు పతి, శ్రీనివాసులు వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలుంటాయి

తనకల్లు: ప్రతి ఒక్కరికీ హక్కులతో పాటు బాధ్యతలుంటాయని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ అన్నారు. కొక్కంటి హరిజనవాడలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏవరికైనా ఏవైనా సమస్యలు ఎదురైతే సబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆరుద్ర శ్రీనివాస్, డీవీఎం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక





వై.చైతన్యప్రసాద్, ఎ.జశ్వంత్

ధర్మవరం అర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ధర్మవరం విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని బీఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 13 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు శనివారం పాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి వై.చైతన్యప్రసాద్ 139 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ ర్యాంకు, పి.జశ్వంత్ 131 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంకు సాధించారన్నారు. విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏటా రూ.15 వేల చొప్పున విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకి స్కాలర్‌షిప్ జమ చేస్తారన్నారు. ఇదిలా ఉండగా బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 23 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్‌ఎం జ్యోతి లక్ష్మి, సుందరయ్యనగర్‌లోని గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం సంజీవయ్య తెలిపారు.

ఇల్లు అమ్ముతామని మోసగించిన వారిపై కేసు

కదిరి అర్బన్: ఇల్లు అమ్ముతామని చెప్పి, డబ్బు తీసుకుని మోసం చేసిన దంపతులపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. కదిరి మండలం బాలప్పగారిపల్లికి చెందిన సుజాత ఆమె భర్త ఓబులేసు 2023లో కదిరి వాసి పెద్దిరెడ్డి శిరీష, భర్త లక్ష్మీనారాయణకు చెందిన శివాలయం వెనుక వీధిలో ఉన్న రూ.13,80,000 విలువ చేసే ఇంటిని కొనేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈక్రమంలో సుజాత దంపతుల వద్ద నుంచి రూ.11,50,000 తీసుకుని ఇంటి రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. సదరు ఇంటి విషయంలో సుజాత విచారణ చేయగా ఇంతకు మునుపే వేరే వ్యక్తులకు ఆయకం పెట్టినట్లు తేలింది. తాము మోసపోయామని తెలుసుకుని బాధితురాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పెద్దిరెడ్డి శిరీష, ఆమె భర్త లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

50 మందికి జరిమానా

కదిరి అర్బన్: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న 50 మంది వివిధ షాపుల యజమానులు, తోపుడుబండ్ల వ్యాపారులపై న్యాయమూర్తి జరిమానా విధించినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. మూడు నెలల నుంచి సుమారు 400 మందిపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. మిగిలిని వారిని కూడా న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తామని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని ఓబులేశ్వర డిఫెన్స్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటున్న పుట్టపర్తి సాయినగర్‌కు చెందిన 17 ఏళ్ల కే.మోహన్ అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ నెల 25న అకాడమీ నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అకాడమీ నిర్వాహకుడు ఓబులేసు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

పెనుకొండ: న్యాయ సేవలు అవసరమైన ఖైదీలకు ఉచితంగా అందిస్తామని జిల్లా న్యాయసేవా అధికార సేవా సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. శనివారం పెనుకొండ సబ్‌జైలును జిల్లా న్యాయసేవా అధికార సేవా సంస్థ కార్యదర్శి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలు ఎలాంటి సదుపాయాలు పొందుతున్నారన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నేరుగా ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల సమస్యలు, బ్యారక్‌లు, భోజన శాలను పరిశీలించారు. న్యాయవాదులు మోహన్‌నాయక్, కొండంపల్లి శ్రీరాములు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్నిగుండం ఏర్పాటు



బత్తలపల్లిలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

బత్తలపల్లి: మండల కేంద్రంలో బొప్పేపల్లి ఖాశీంస్వామి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవాలను గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ప్రారంభించారు. శనివారం పీర్ల చావిడి ముందు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ఏటా అగ్నిగుండం పెరుగుతుండడంతో అందులోని బూడిదను ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. జేసీబీ సాయంతో అగ్నిగుండంను తీశారు. దీంతో చిన్నారులు చెత్తను, ముళ్లకంపను తీసుకువచ్చి అగ్నిగుండం రగిలించి గుండం చుట్టూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. ఇదిలా ఉండగా ముజావర్లు మహబూబ్‌బాషా, ఖాశీం పీరా, ఫక్రుద్దీన్, ఖాశీంవలి చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సోమశేఖర్ ప్రజలకు సూచించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



దాతలను సత్కరిస్తున్న రెడ్డి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

నల్లచెరువు: కదిరిలో రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి చెవిటివారిపల్లికి చెందిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, నాగమణి దంపతులు రూ.10 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా దాతలు రెడ్డి వెల్ఫేర్ కమిటీ సభ్యులకు శనివారం రూ.2 లక్షలు అడ్వాన్సుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులను శాలువలతో ఘనంగా సత్కరించారు. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి టెంపుల్ మాజీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆపన్నహస్తం



నవీన్‌నాయక్‌కు నగదు అందిస్తున్న వందేమాతరం టీం సభ్యులు

తనకల్లు: దేవళంతండాకు చెందిన నవీన్ నాయక్ ప్రమావశాత్తు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురికావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో బాలుడి ఎడమ చేతిని తొలగించారు. విషయం తెలుసుకున్న వందేమాతరం టీం సభ్యులు నవీన్ నాయక్ వైద్య ఖర్చుల కోసం శనివారం రూ. 20 వేలు అందజేశారు. అడిగిన వెంటనే ఆర్థికంగా అండగా నిలిచిన వందేమాతరం టీం సభ్యులకు ఈ సందర్భంగా నవీన్‌నాయక్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీం సభ్యులు తమ్మిశెట్టి రవీంద్ర, కొండ్ల రమేష్, సుంకు వెంకటరమణ, బాగేపల్లి అశోక్, నవీన్, బాలు, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజలు

కదిరి అర్బన్: అర్హులైన నిరుపేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు శనివారం వారు కుమ్మరవాండ్లపల్లి ప్రజలతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇంటి స్థలాల కోసం గతంలోనే తహసీల్దార్, ఆర్డీఓలకు విన్నవించామని ఇంతవరకు స్థలాలు కేటాయించలేదన్నారు. పంచాయితీ పరిధిలోని 720 సర్వేనంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో తమకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జీఎల్ నరసింహులు, నాయకులు బాబ్జాన్, ముస్తాక్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి టౌన్: వారాంతపు సెలవును పురస్కరించుకొని ఆదివారం శిల్పారామంలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు ప్రియపెట్టేం అవిఘ్న అభ్యాస ఇనిస్టిట్యూట్ డ్యాన్స్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ బృందం(బెంగళూరు) భరతనాట్యం, నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

తనకల్లు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ హెచ్చరించారు. బొంతలపల్లి గ్రామ సర్వే నంబర్ 183–ఏ లోని ప్రభుత్వ భూములను ఆర్‌ఐ అశోక్‌చక్రవర్తి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు పట్టణం సర్వే నంబర్ 183–ఏ అతి సమీపంలో ఉందన్నారు. దీంతో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి షెడ్‌లను నిర్మించినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అక్రమంగా షెడ్లను నిర్మించిన వారికి వెంటనే నోటీసులను జారీ చేసి వాటిని తొలగిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ స్థలం అని తెలియజేసేలా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

కదిరి: స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కదిరిని సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసే విషయంపై చర్చించేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నిసా పేర్కొన్నారు. మంచినీటి సరఫరా అంశాలపై కూడా చర్చిస్తామని తెలిపారు. కౌన్సిల్ సభ్యులతో పాటు కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆశావర్కర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాల్యవంతం చెర్లోపల్లి, ఓబుళాపురంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు జూలై 4లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నల్లచెరువు: యర్రగుంటపల్లి ఆశా కార్యకర్త ఆశా కార్యకర్త పోస్టు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కల్పన రెడ్డి శనివారం తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30 నుంచి జూలై 4వ తేదీ వరకూ స్థానిక ఆరోగ్యకేంద్రం లేదా స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: మొహర్రం వేడుకలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గ్రామాల్లో మొహర్రం పండుగను జరుపుకునే వారు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసుల అనుమతి పొందిన తరువాతనే మొహర్రం పండుగకు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

పాత్రికేయుడికి డాక్టరేట్




డాక్టరేట్ అందుకుంటున్న జయానందన్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి విశాలాంధ్ర బ్యూరో జయనందన్‌రెడ్డికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూరులో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందించారు. ఈసందర్భంగా జయానందన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

కదిరి టౌన్: ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనార్దనానంద సరస్వతి వేద విద్వన్మహా సభలో శనివారం రెండో రోజు గోపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పరీక్షలు, వేద పారాయణం జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను వేదపండితులు ఘనంగా సన్మానించారు. మహోన్నతమైన కార్యక్రమం కదిరిలో నిర్వహించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లింగశెట్టి పాళ్యంవీధిలో శనివారం ఆషాఢమాసం సందర్భంగా ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామికి పూజలు చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.